ఆదివాసీ కుటుంబాలకు చేయూతనివ్వాలి: సీఎస్

భద్రాచలం, ఏప్రిల్ 16: ఆదివాసీ, గిరిజన కుటుంబాలకు ఐటీడీఏ ద్వారా చేయూతనందించాలని చీఫ్ సెక్రటరీ శాంతికుమారి సూచించారు. గిరిజనులకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలపై భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సంబంధిత అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గిరిజన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక బోధన, ప్రత్యేక తమెనూ అందించాలని సూచించారు. రక్తహీనత ఉన్న పిల్లలను గుర్తించి న్యూట్రిషన్ ఫుడ్ అందించాలని ఆదేశించారు. తొలుత సీఎస్‌కు పీవో ప్రతీక్‌జైన్ మొక్క అందించి స్వాగతం పలికారు. అధికారులు డేవిడ్ రాజ్, మణెమ్మ, తానాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కూనంనేనిపై కేసు నమోదు

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 16: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి సమావేశాలు నిర్వహించినందుకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుపై పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్యే కూనంనేని మార్చి 23న భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలం తోగ్గూడెం, జగన్నాథపురం పంచాయతీల్లో సమావేశాలు నిర్వహించారు. అయితే, అధికారిక అనుమతులు లేకుండా ఎమ్మెల్యే కూనంనేని సమావేశాలు నిర్వహించారంటూ, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారంటూ పాల్వంచ ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి ఈ నెల 8న పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీనివాస్ అదే రోజు కేసు నమోదు చేశారు. కాగా, ఈ విషయం మంగళవారం వెలుగులోకి వచ్చింది.

జెన్కో సీఎండీని కలిసిన 'విద్యుత్' క్రీడాకారులు

పాల్వంచ, ఏప్రిల్ 16: హర్యానాలోని కురుక్షేత్రలో ఇటీవల జరిగిన ఆలిండియా ఎలక్ట్రిసిటీ బోర్డ్స్ టోర్నమెంట్‌లో విజయం సాధించి ట్రోఫీలను కైవసం చేసుకున్న క్రీడాకారులు, మహిళా క్రీడాకారులను హైదరాబాద్ విద్యుత్ సౌధలో జెన్కో సీఎండీ ఎస్ఏఎం రిజ్వి మంగళవారం అభినందించారు. విజేతలైన చెసే, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, క్యారమ్స్ క్రీడాకారులను ప్రత్యేకంగా ప్రశంసించారు. జెన్కో స్పోర్ట్స్ ఆఫీసర్ లోహిత్ ఆనంద్, జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, ప్రకాష్, క్రీడాకారులు ఆరీఫ్, సాల్మన్‌రాజు, వెంకటేశ్వర్లు, సతీష్, సతీష్‌కుమార్, రాజేశ్వర్‌రెడ్డి, అక్బర్, మమత, పావని, శ్రీవల్లి, పార్వతి, చిన్నారి, నాగలక్ష్మి, మాధవి, భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీసీ సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకోవాలి

మణుగూరు టౌన్, ఏప్రిల్ 16 : ఐటీఐ విద్యకు సంబంధించి ఏదేని ట్రేడులో మూడు సంవత్సరాల పారిశ్రామిక అనుభవం ఉన్న అభ్యర్థులు సంబంధిత ట్రేడు నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్(ఎన్‌టీసీ) పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని మణుగూరు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ బడుగు ప్రభాకర్ మంగళవారం తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 19వ తేదీ లోపు వరంగల్‌లోని రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయానికి వెళ్లి నేరుగా దరఖాస్తులు అందజేయాలన్నారు.

వ్యవసాయ విద్యార్థుల క్షేత్ర సందర్శన

అశ్వారావుపేట టౌన్, ఏప్రిల్ 16 : అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు మంగళవారం క్షేత్ర సందర్శన చేశారు. స్వయం సహకార సంఘాల నిర్వహణపై గ్రామదీపికల ద్వారా స్వయం సహాయక సంఘాల నిర్వహణ, రుణాలు పొందే తీరును తెలుసుకున్నారు. ఆర్థికంగా సంఘాలు ఏ విధంగా ముందుకు సాగుతున్నాయన్న వాటిపై గ్రామదీపిక కొప్పుల శివకుమారి వారికి వివరించారు. అధ్యాపకులు డాక్టర్ కృష్ణతేజ, అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

టేకులపల్లి, ఏప్రిల్ 16 : ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా నాయకులు డి.ప్రసాద్, ఎట్టి నరసింహారావు కోరారు. మంగళవారం బోడు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఉపాధిహామీ కూలీల సమావేశంలో వారు మాట్లాడారు. సంవత్సరానికి కుటుంబానికి 200 రోజులకు తగ్గకుండా పని కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పూన్నెం లక్ష్మయ్య, ఈసాల లాలయ్య, రామచంద్రు, సురేశ్, బాల రాజు, సీతమ్మ, యశోద తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 16: గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ మామిళ్లపల్లి రామారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో వైస్ ఎంపీపీ మామిళ్లపల్లి రామారావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారుల పనుల పురోగతిని అడిగి తెలుసుకొన్నారు.

బస్సు అద్దం పగలగొట్టిన వ్యక్తిపై కేసు నమోదు

అశ్వాపురం, ఏప్రిల్ 16 : తాను దిగాల్సిన స్టేజీలో బస్సు ఆపలేదనే కారణంతో కల్యాణపురం గ్రామానికి చెందిన బానోతు శివనారాయణ మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అద్దం పగలగొట్టిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పూర్తి వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం నుంచి మణుగూరు వెళ్తున్న మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న బానోతు శివనారాయణ గోపాలపురం వద్ద బస్సు దిగేందుకు బస్సు ఆపాలని డ్రైవర్‌ను కోరాడు. కొంత దూరం వెళ్లాక బస్సును ఆపడంతో బస్సుడ్రైవర్‌తో శివనారాయణ వాగ్వాదానికి దిగాడు. ఆయన్ని మణుగూరు పోలీసులకు అప్పగించేందుకు బస్సుడ్రైవర్ బస్సును మణుగూరు వైపునకు నడుపుతుండగా బస్సును కల్యాణపురం వద్ద గ్రామస్తులు అడ్డుకుని బస్సు అద్దం పగలగొట్టి అడ్డువచ్చిన డ్రైవర్, కండక్టర్‌పై చేయిచేసుకున్నారు. దీంతో బస్సుడ్రైవర్ ఫిర్యాదు మేరకు శివనారాయణపై ఎస్సై సురేశ్ కేసు నమోదు చేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

టైటిల్ డీడ్ పోయినది
బొమ్మనబోయిన సురేష్ కుమార్ తండ్రి : కృష్ణయ్య, ఇ.నెం.17-1-382/R/44/A,వైశాలినగర్, నరూర్‌నగర్, హైదరాబాద్ జిల్లా, తెలంగాణ 500079, అను నేను హైదరాబాద్ నుండి ఖమ్మం వస్తుండగా ఖమ్మం బస్టాండ్ నందు బస్సు దిగు సమయంలో ఒరిజినల్ టైటిల్ డీడ్ (డాక్యుమెంట్ నెం. 1303/1997,SRO-KHAMMAM) పోయినది.కావున ఎవరికైనా దొరికిన వారు పై చిరునామ లో సంప్రదించగలరు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పోడు సమస్యకు పరిష్కారం చూపాలి

అశ్వాపురం, ఏప్రిల్ 16 : పోడు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కాంగ్రెస్ మండల నాయకుడు ఓరుగంటి రమేశ్‌బాబు ఆధ్వర్యంలో కొమ్ముగూడెం పోడు రైతులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గత 24 ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న పోడు భూమిలో ఫారెస్టు అధికారులు దౌర్జన్యంగా మొక్కలు నాటేందుకు ప్రయత్నిస్తున్నారని తెలుపగా పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రామకృష్ణ, నరేశ్ కుమార్, కోటయ్య, రమేశ్, సమ్మయ్య, నర్సింహారావు, పెంటయ్య, రాములు, జోగయ్య, నాగరాజు, రాము, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

శ్రీరామనవమికి ముస్తాబైన రామాలయాలు

జూలూరుపాడు:ముస్తాబైన పడమటనర్సాపురం రామాలయం, పాల్వంచ: కల్యాణానికి ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు, పర్ణశాల: ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

కొత్తగూడెం టౌన్/ జూలూరుపాడు/ పాల్వంచ, ఏప్రిల్ 16: శ్రీరామనవమి వేడుకల కోసం జిల్లాలోని పలు ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఆయా ఆలయాల్లో వాటి నిర్వాహకులు బుధవారం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే చలువ పందిళ్లను సిద్ధం చేసి ఉంచారు. జూలూరుపాడు మండలంలోని జూలూరుపాడు, కాకర్ల, పడమటనర్సాపురం, గుండెపుడి, అనంతారం, బేతాళపాడు, పాపకొల్లు, వినోబానగర్ గ్రామాల్లోని పలు ఆలయాల్లోనే రాములోరి కల్యాణం రమణీయంగా జరుగనుంది. భద్రాచలంలో జరిగే శ్రీరామనవమి వేడుకలకు వెళ్లే భక్తుల కోసం రోడ్లు, భవనాల శాఖ అధికారులు రహదారిలోని డివైడర్లకు, రోడ్డుకు రంగులు వేశారు. కొత్తగూడెంలోని శ్రీ విజయవిఘ్నేశ్వర స్వామి దేవాలయంలో శ్రీకోదండ రామస్వామివారి కల్యాణ క్రతువును బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సులోచన మంగళవారం తెలిపారు. అలాగే, సీతారాములు నడయాడిన పిలువబడే పాల్వంచ భజన మందిరంలోనూ రాములోరి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ మేరకు మంగళవారం ఆలయ మూలవిరాట్‌లకు అభిషేకం చేశారు. అనంతరం సేవాదళ్ మహిళా సభ్యులు పసుపు దంచడం, తలంబ్రాలు కలపడం తదితర కార్యక్రమాలు చేపట్టారు.

పర్ణశాల: కల్యాణ మంటపం వద్ద వేసిన పందిళ్ల కింద సేద తీరుతున్న భక్తులు

అశ్వారావుపేట రూరల్‌లో..

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 16: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామ నమమి పురస్కరించుకుని రామాలయాలను ముస్తాబు చేశారు. రంగులు వేశారు. విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. పల్లెల్లో తాటాకు పందిళ్లు వేశారు.

పర్ణశాలలో..

పర్ణశాల, ఏప్రిల్ 16: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో బుధవారం జరగబోయే సీతారాముల వారి కల్యాణానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు ఇప్పటికే పర్ణశాలకు చేరుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు.

గడపగడపకు జైశ్రీరామ్

పినపాక, ఏప్రిల్ 16 : శ్రీరామనవమి వేడుకల నేపథ్యంలో మండల పరిధిలోని ఏడూళ్లబయ్యారం గ్రామంలో ఆకుల సత్యనారాయణ అనే భక్తుడు మంగళవారం గడపగడపకు వెళ్లి ఇంటిగోడపై జైశ్రీరామ్ అని వాల్‌రైటింగ్ చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులందరూ సహకరించినట్లు సత్యనారాయణ తెలిపారు.

జైశ్రీరామ్ అని ఇంటి గోడపై ముద్రిస్తున్న భక్తుడు

నిరుద్యోగ యువతకు శిక్షణ

టేకులపల్లి, ఏప్రిల్ 16 : స్కిల్ డెవలప్‌మెంట్ ఉచిత శిక్షణ దరఖాస్తు గడువు ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించామని, సింగరేణి ఇల్లెందు ఏరియా పరిధిలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకొని, ప్రింట్ కాపీలను ఇల్లెందు ఏరియా ఎంవీటీసీ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

'అన్ని రంగాల్లో రాణించి విజేతలుగా నిలవాలి'

రామవరం, ఏప్రిల్ 16: ప్రతి ఒక్కరూ తాము ఎంచుకున్న రంగంలో రాణించి విజేతలుగా నిలవాలని మైనార్టీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా మంగళవారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. యూపీఎస్సీ ఇటీవల విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో 51 మంది ముస్లిం అభ్యర్థులు ప్రతిభ కనబర్చి సత్తా చాటారని అన్నారు. ముస్లిం అభ్యర్థులు పలు కేంద్ర సర్వీసుల్లో నియామకాలు పొందడం హర్షణీయమని అన్నారు.

తెలంగాణ హక్కులను కాపాడేది బీఆర్ఎస్ మాత్రమే

మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత

ఇల్లెందు, ఏప్రిల్ 16: హామీలను అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ ప్రజలకు పిలుపునిచ్చారు. మహబుబాబాద్ పార్లమెంటరీ పరిధిలోని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇల్లెందు నియోజకవర్గ ఎన్నికల సన్నాహాక సమావేశం స్థానిక ఐతా పంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయలేకపోయిందని విమర్శించారు. పంటలు ఎండిపోతున్నా ముఖ్యమంత్రి, మంత్రులకు చీమకుట్టినట్టైన లేదని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నమ్మి మోసపోయామని ప్రజలకు అర్థమై బాధపడుతున్నారన్నారు. ఈ ప్రాంతానికి కాంగ్రెస్, బీజేపీలు చేసిందేమిలేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇల్లెందు నియోజకవర్గంలో సుమారు 3 వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని గ్రామ గ్రామాన ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, మహబుబాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్, నాయకులు ఎస్.రంగనాథ్, శీలం రమేష్, ప్రసాద్, పరుచూరి వెంకటేశ్వరరావు, అంతోటి అచ్చయ్య, జేకే శ్రీను, సిలివేరి సత్యనారాయణ, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ మాలోత్ కవిత

వసతుల కల్పన పారదర్శకంగా ఉండాలి

డీఈవో వెంకటేశ్వరాచారి

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 16: 'అమ్మ' ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పూర్తి పారదర్శకంగా ఉండాలని డీఈవో వెంకటేశ్వరాచారి సూచించారు. ఇరిగేషన్ అధికారులు, గ్రామ సమాఖ్య సభ్యులు, పాఠశాల కమిటీ బాధ్యులతో మండలంలోని పాండురంగాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాండురంగాపురం పాఠశాలకు ప్రభుత్వం రూ.9 లక్షల నిధులను కేటాయించిందని, వీటితో పాఠశాలలో అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. అయితే, ఈ పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీరామ్మూర్తి, ఉత్తరకుమారి, నారాయణ, చంద్రశేఖర్, మురళి, నీలావతి, ఉర్మిళ, సరస్వతి, రాంబాబు, పోరండ్ల రంగా తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరాచారి

తాగునీటి సమస్యపై ఎమ్మెల్యేకు వినతి

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 16: స్థానిక కొమరంభీం కాలనీలో పేదలకు మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆ కాలనీ మహిళలు మంగళవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును వినతిపత్రం సమర్పించారు. కాలనీ ప్రజలతో ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మహిళలు మాట్లాడుతూ.. తమ కాలనీలో తాగునీటి సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యేకి వివరించారు.

మట్టి తోలకాలను అడ్డుకున్న ఆదివాసీలు

అశ్వాపురం, ఏప్రిల్ 16 : మండలంలోని కొమ్ముగూడెం చింతలచెరువులో గత కొద్ది రోజులుగా జరుగుతున్న మట్టి తోలకాలను మంగళవారం మండల ఆదివాసీ జేఏసీ కమిటీ సభ్యులు అడ్డుకున్నారు. జేసీబీతోపాటు 10 ట్రాక్టర్ల మట్టి తోలకాలను నిలిపివేసి సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. ఏజెన్సీ ప్రాంతంలో అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి, గ్రావెల్, ఇసుక తోలకాలు చేపడితే అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ఆదివాసీ జేఏసీ అధ్యక్షుడు కల్లూరి నర్సింహారావు, సభ్యులు చాపా ముత్తయ్య, పర్శిక సూరిబాబు, తంగిళ్ల భద్రయ్య, కుంజా రామారావు, బోడిక వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 16 : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీవో రోజారాణి అన్నారు. మంగళవారం గాండ్లగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిగితే డయల్ 100, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మావతి, వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి, ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ టీచర్లు ఆదిలక్ష్మి, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

చండ్రుగొండ, ఏప్రిల్ 16 : క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని సీనియర్ రాజకీయ నాయకుడు సారేపల్లి శేఖర్ అన్నారు. మంగళవారం అయన్న పాలెం గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా క్రీడాపోటీలను(క్రికెట్, వాలీబాల్) ప్రారంభించి మాట్లాడారు. మాట్లాడుతూ....క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలన్నారు. ఓటమిని గెలుపుకు పునాదిగా వేసుకొని ముందుకు సాగాలన్నారు. మాలోత్ బోజ్యనాయక్, కేశబోయిన నరసింహారావు, రామరాజు, ప్రసాద్, లక్ష్మణ్, మనోహర్, క్రీడాకారులు వెంకటేశ్, సాయి పాల్గొన్నారు.

ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలి

సారపాక, ఏప్రిల్ 16 : కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు పున్నం చంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సాధ్యంకాని హామీలను ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని విమర్శించారు. ప్రభుత్వ మద్దతు ధర బూర్గంపహాడ్ మార్కెట్‌యార్డులో అమలు కావడంలేదని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 16: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య ఉన్న పెద్దమ్మతల్లి దేవాలయంలో జరుగుతున్న శ్రీదేవీ వసంత నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం శ్రీకనకదుర్గ అమ్మవారికి రుత్విక్కులు సుప్రభాత సేవ, వేదపారాయణం, సూర్యనమస్కారం ఏకాదశ రుద్రాభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయ స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం లక్ష కుసుమార్చన, సాయంత్రం నివేదన, నీరాజన మంత్రపుష్పం కార్యక్రమాలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రైం వార్తలు

బైకును ఢీ కొట్టిన ఆటో.. వ్యక్తి మృతి

జూలూరుపాడు, ఏప్రిల్ 16: రోడ్డుపై వెళ్తున్న ఓ ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న ఓ ఆటో ఢీకొట్టిన ఘటన జూలూరుపాడు మండలం బేతాళపాడు – పడమటనర్సపురం గ్రామాల మధ్య మంగళవారం జరిగింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి తీవ్రగాయాలపాలై మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని బేతాళపాడు గ్రామానికి చెందిన కిలారు నర్సింహారావు (45) మిర్చి తోటలో కూలీల కోసం పడమటనర్సాపురం గ్రామానికి తన ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు.అదే క్రమంలో పడమటనర్సాపురం నుంచి బేతాళపాడు వైపు వస్తున్న ఆటో రేగళ్లతండా శివారులో ఇతడి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నర్సింహారావు తలకు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అతడిని 108 వాహనంలో కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తిరుపతిరావు తెలిపారు.

వడదెబ్బ తో 'ఉపాధి' కూలీ మృతి

చుంచుపల్లి, ఏప్రిల్ 16: వడదెబ్బకు గురై ఉపాధి కూలీ మృతిచెందిన ఘటన చుంచుపల్లి మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని పెనుబల్లి గ్రామానికి చెందిన గిరిజన మహిళా బూరుగు వెంకటమ్మ (55) ఉపాధి హామీ కూలి పనులకు వెళ్తోంది. ఎండల కారణంగా ఇటీవల వడదెబ్బకు గురైన ఆమె.. మంగళవారం మృత్యువాత పడింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా ఆ గ్రామానికి వెళ్లి ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు.

రేషన్ బియ్యం పట్టివేత

మణుగూరుటౌన్, ఏప్రిల్ 16 : అక్రమంగా తరలిస్తున్న 10క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు మణుగూరు సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. మండలకేంద్రంలో వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో బియ్యం పట్టుబడినట్లు పేర్కొన్నారు. మణుగూరు మండలం సమితిసింగారం గ్రామానికి చెందిన సుగ్గల జనార్దన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సారా పట్టివేత

మణుగూరుటౌన్, ఏప్రిల్ 16: మండలంలోని బ్రహ్మంగారిగుట్ట ఏరియాలో నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు మణుగూరు సీఐ సతీష్‌కుమార్ ఆదేశాల ప్రకారం మణుగూరు పోలీసులు తయారీ స్థావరాలపై ఆకస్మికంగా దాడి చేసి పది లీటర్ల నాటుసారా పట్టుకున్నారు. సారా విక్రేత బొమ్మల వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేశారు.

కల్వర్టులో పడి వ్యక్తి మృతి

సారపాక, ఏప్రిల్ 16: డ్రైనేజీ పనులు జరుగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు కల్వర్టులో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన సారపాకలోని గాంధీనగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. గాంధీనగర్‌లో నూతన డ్రైనేజీ నిర్మాణ పనులు నెలరోజులుగా జరుగుతున్నాయి. కొంగా భాస్కర్(53) అనే వ్యక్తి కిరాణాషాపునకు వెళ్లేందుకు రోడ్డు దాటే ప్రయత్నం చేస్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందాడు. ఎస్సై నాగభిక్షం అక్కడకు వెళ్లి భాస్కర్ మృతికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

పశువులు తరలిస్తున్న వ్యాన్ సీజ్

అశ్వారావుపేట, ఏప్రిల్ 16 : అనుమతులు లేకుండా పశువులను తరలిస్తున్న వ్యాన్‌ను పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద ఎస్సై శ్రీరాముల శ్రీను వాహనాల తనిఖీ చేస్తుండగా జంగారెడ్డిగూడెం నుంచి 32 గేదెలను తరలిస్తున్న వ్యాన్ పట్టుబడింది. అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యవసాయ మోటరు చోరీ

అశ్వాపురం, ఏప్రిల్ 16 : మొండికుంటలో కౌలు రైతు పర్షిక భాస్కర్ వ్యవసాయ మోటరు చోరీకి గురైంది. సోమవారం అర్ధరాత్రి దొంగలు మోటరును దొంగిలించారని, ఆరునెలల క్రితం మోటరును ఎత్తుకెళ్లారని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. మంగళవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

బోడు పాఠశాల టీచర్ సస్పెన్షన్

టేకులపల్లి, ఏప్రిల్ 16 : బోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ టీచర్ ఎం.సీతారామయ్యను డీఈవో సస్పెండ్ చేసినట్లు ఎంఈవో ఠాగూర్ రాంసింగ్ తెలిపారు. సీతారామయ్య ప్రవర్తనపై విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

'విద్యార్థి మృతిపై విచారణ జర